## క్రమంగా పెరుగుతున్న గోదావరి వరద

**- హెచ్చరిక బోర్డులను ఏర్పాటు**



**టీ మీడియా ,జూలై 10,భద్రాచలం :**లో గోదావరి వరద క్రమ క్రమంగా పెరుగుతోంది. మంగళవారం రాత్రి 20 అడుగులు ఉండగా బుధవారం సాయంత్రం 6 గంటలకు 24 అడుగులను నీటి మట్టం దాటింది. ఎగువ ప్రాంతాలలో కురిసిన వర్షాల కారణంగా వాగులు పొంగడంతో గోదావరి నదికి వరద చేరుతోంది. భద్రాచలంలోని స్నానఘట్టాల కింది వైపు మునగడంతో పూజా సామగ్రిని విక్రయించే చిరు వ్యాపారులు తమ దుకాణాలను కరకట్టపైకి చేరవేశారు. శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయానికి వచ్చిన భక్తులు పుణ్యస్నానాలను ఆచరించారు. ఎలాంటి ప్రమాదాలకు ఆస్కారం లేకుండా ముందస్తు హెచ్చరిక బోర్డులను అధికారులు ఏర్పాటు చేశారు. గజ ఈతగాళ్ల బృందాన్ని నది వద్ద ఉంచారు. అత్యవసర పరిస్థితుల్లో వినియోగించుకోవడానికి వీలుగా లాంచీలు, పడవలను సిద్ధం చేశారు.

# గిరిజన కుటుంబం వెలి

**-భూ పంచాయితీయే కారణం**




**టీ మీడియా ,జూలై 10, ఇల్లందు:** ప్రపంచం అన్ని రంగాల్లో పరుగులు తీస్తున్న ఈ ఆధునిక కాలంలోనూ అనాగరికం రాజ్యమేలుతోంది అనడానికి ఈ ఘటన నిదర్శనం. భూ పంచాయితీలో తమ మాట వినలేదంటూ గిరిజన కుటుంబాలను వెలి వేశారు. మానవీయత లోపించిన కొందరు మనుషులని దూరంగా ఉంచుతున్నారు. తమ కులం నుండి బహిష్కరించి వారిని మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు మండలం పాత పూస పెల్లి గ్రామంలో కుల బహిష్కరణ చర్చనీయాంశంగా మారింది. ఓ భూ వివాదంలో గ్రామ పెద్దలు చెప్పినట్టు వినలేదని తమను కులం నుండి బహిష్కరించారని బాధిత ఐదు కుటుంబాలు ఆరోపిస్తున్నాయి.పాత పూసపెల్లి గ్రామంలో ముడిగే వంశస్థులైన గిరిజనులు రాములు, సీత, లక్ష్మీనారాయణ, సత్యనారాయణ అనే ఐదు కుటుంబాలకు మొత్తం 35 ఎకరాల భూమి ఉంది. 8 ఎకరాల భూమి తమకు రావాలి అంటూ కుంజ నరేష్, వినోద్, కుంజ భారతి తమపై గొడవకు దిగి కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ముడిగే వంశస్థులైన ఐదు కుటుంబాల వ్యక్తులు ఆరోపిస్తున్నారు. ఈ భూమి విషయంలో పెద్ద మనుషులు జోక్యం చేసుకొని తమకు అన్యాయమైన తీర్పు ఇవ్వటంతో తాము ఒప్పుకోలేదని దాంతో కోపోద్రిక్తులైన పెద్ద మనుషులు తమను గ్రామం నుండి కుల బహిష్కరణ చేశారని బాధితులు ముడిగే రాములు, సత్యనారాయణ, ఐదుగురు వ్యక్తులు ఆరోపిస్తున్నారు. ఈ భూమిని మా తాత తండ్రుల నుండి సేద్యం చేస్తున్నామని తెలిపారు.కుల బహిష్కరణ పేరుతో గ్రామంలో శుభకార్యములకు తమని పిలవడం లేదన్నారు. ఎవరిని తమకు సహాయ సహకారాలు అందించకుండా గ్రామ పెద్దలు నిర్ణయించారని ఆరోపించారు. ఎవరైనా తమకు సహాయం అందిస్తే వారిని బెదిరింపులకు గురి చేస్తున్నారన్నారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేశామని ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు. గ్రామంలో ఏ పనికి పిలవడం లేదని, ఆఖరికి తమ కుటుంబం లో ఓ మహిళ మృతి చెందితే కడసారి చూపుకు కూడా ఎవరూ రాలేదని దహన సంస్కారాలకు వేరే గ్రామం నుంచి కొందరు వస్తే వారిపైన ఆగ్రహం వ్యక్తం చేశారని బాధితులు వాపోతున్నారు. ఈ విధంగా ప్రతి విషయంలోనూ ఇబ్బంది పెడుతూ మానసిక క్షోభ కు గురి చేస్తున్నారు. పోలీసులు వారిపై చర్యలు తీసుకోవాలని తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.




## ఏసీపీ, కానిస్టేబుళ్లపై వేటు

**టీ మీడియా ,జూలై 10,ఖమ్మం** :మిర్చి వ్యాపార గుమస్తాను బెదిరించి రూ. 6.00 లక్షల నగదును దోచుకున్న ఘటనలో ఖమ్మంలో పనిచేస్తున్న ఓ ఏసీపీపై, ఇద్దరు కానిస్టేబుళ్లపై గురువారం శాఖాపరమైన వేటు పడింది. ఈమేరకు ఖమ్మం సీటీసీ (సిటీ ట్రెయినింగ్ సెంటర్)లో ఏసీపీగా పనిచేస్తున్న రవిని డీజీపీ ఆఫీసుకు అటాచ్ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. అదేవిధంగా ఏసీపీకి గన్ మెన్ గా, డ్రైవర్ గా పనిచేస్తున్న కానిస్టేబుళ్ల నాగరాజు, ఉపేందర్ లను సస్పెండ్ చేస్తూ ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఉత్తర్వు జారీ చేశారు .కొద్దిరోజుల క్రితం ఖమ్మం వ్యవసాయ మార్కెట్ లో మిర్చి వ్యాపార గుమస్తాను బెదిరించి రూ. 6 లక్షల నగదును కానిస్టేబుళ్ల నాగరాజు, ఉపేందర్ లు దోపిడీ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. అయితే ఆ తర్వాత పరిణామాల్లో ఈ ఘటనలో ఎటువంటి ఫిర్యాదు

మిగతా 3లో

## సిసిఐ ద్వారా నే కోనుగోలు చేయాలి

**-తెలంగాణ రైతు సంఘం**



**టీ మీడియా,జూలై10, సింగరేణి (కారేపల్లి) :** కేంద్ర ప్రభుత్వం పత్తి కొనుగోలుకు ప్రైస్ డెఫిషియన్సీ పేమెంట్ స్కీం ( పీడీపీఎస్) విధానం ప్రవేశపెట్టాలని చూస్తుందని దానిని విరమించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. గురువారం కారేపల్లి మండలం పాటిమీదగుంపు, బాజుమల్లాయిగూడెం గ్రామాలలో పత్తి పంట పరిశీలన చేశారు. రైతుల నుంచి కౌలు రేట్లు, వివిధ పంటల సాగు పరిస్థితి, మిర్చి సాగు విస్తీర్ణం పై రైతుల తో మాట్లాడారు. ఈ సందర్భంగా బొంతు రాంబాబు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కేంద్రం ప్రకటించిన మద్దతు ధరకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) పత్తిని కొనుగోలు చేస్తుందన్నారు.కేంద్రం ప్రభుత్వం బాధ్యతల నుంచి తప్పించుకోవటానికి పీడీపీఎస్ విధానాన్ని తీసుకవస్తుందన్నారు. దీనికి రాష్ట్రం ప్రభుత్వం అంగీకరించిందన్నారు. ఎంఎస్పి విధానంలో కేంద్ర ప్రభుత్వం నేరుగా రైతుల నుంచి ప్రభుత్వరంగ సంస్థల ద్వారా పంటలు కొనుగోలు చేస్తుందన్నారు పీడీపీఎస్ విధానంలో రైతు తన పత్తి పంటను బహిరంగ మార్కెట్లో విక్రయించాల్సి ఉంటుందని, పత్తి మార్కెట్ ధర కన్నా ఎంఎస్పీ ఎంత తక్కువ ఉంటే ఆ వ్యత్యాస మొత్తాన్ని నేరుగా డిబిటి (డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్ఫర్) పద్ధతుల్లో రైతు ఖాతాల్లో జమ చేస్తారన్నారు. ప్రభుత్వం రైతు దగ్గర పంటను కొనకుండా మార్కెట్లో రైతు నష్టపోయిన మొత్తాన్ని సర్దుబాటు

మిగతా 3లో

# అవినీతి చక్రవర్తి -అసమర్థ సీఎం

**బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు**

**ఐదు గ్రామాలను తెలంగాణలో విలీనం చేయాలి**

**జాగృతి సమావేశంలో ఎమ్మెల్సీ కవి**

**టీ మీడియా ,జూలై 10 ,కొత్తగూడెం :** తెలంగాణ రాష్ట్రం గాడిన పడే సమయంలోనే కాంగ్రెస్ చేతిలోకి వెళ్లిందని, దీంతో మళ్లీ మన అస్తిత్వం కోసం పోరాటాలు, ఉద్యమాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలంగాణ జాగృతి వ్యవస్థాపకురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. జై తెలంగాణ అనని వ్యక్తి సీఎం రేవంత్ రెడ్డి అని, అవినీతి చక్రవర్తి– అసమర్థ ముఖ్యమంత్రి ఈ రాష్ట్రానికి అవసరమా? అని ఆమె ప్రశ్నించారు. గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం పట్టణంలోని కొత్తగూడెం క్లబ్లో నిర్వహించిన జాగృతి సమావేశంలో ఆమె మాట్లాడారు. తొలుత సీఐటీయూ జిల్లా నాయకుడు, జి.వీరన్న, వివిధ సంఘాల నాయకులకు జాగృతి కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.



దేవుళ్ల మీద ఒట్టు వేస్తూ సీఎం రేవంత్ రెడ్డి పబ్బం గడుపుకుంటున్నారని విమర్శించారు.

**తగిన రీతిలో బుద్ధి చెబుతాం**

మహిళలకు నెలకు రూ.2,500, దివ్యాంగులకు రూ.8 వేల పెన్షన్, ఇతర పింఛన్‌దారులకు రూ.4 వేలు ఇస్తానని, కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ పథకం ద్వారా తులం బంగారం ఇస్తానని హామీలు ఇచ్చి ఏ ఒక్కటీ కూడా అమలు చేయకుండా కాలయాపన చేస్తూ మోసం చేసిన సీఎంకు రానున్న రోజుల్లో ప్రజలు తగిన రీతిలో బుద్ధి చెబుతారన్నారు.

**బొగ్గు గనుల ప్రైవేటీకరణ సహించం**

సింగరేణిలో కార్మికుల సంక్షేమం, హక్కులు గాలికి వదిలేశారని, ఆనాడు కేసీఆర్ డిపెండెంట్ ఉద్యోగాలు ఇచ్చి సంస్థను కాపాడుకుంటే నేడు సమస్యలు పట్టనట్లుగా వ్యవహరిస్తూ, బొగ్గు గనులను ప్రైవేట్ పరం చేయాలని చూస్తున్నారని, ప్రైవేట్ పరం చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. భద్రాచలం పరిసర ప్రాంతాల్లో ఐటీసీ కర్మాగారం వల్ల కాలుష్యం పెరిగి ప్రజలు ఇబ్బందులుపడుతున్నారని, ముగ్గురు మంత్రులు ప్రజల సమస్యలపై స్పందించి పరిష్కరించే చర్యలు చేపట్టాలన్నారు.

**ఆ ఐదు గ్రామాలను తెలంగాణలో విలీనం చేయాలి**

ఆంధ్రప్రదేశ్‌లో కలిపిన ఐదు గ్రామాలను (యటపాక, కన్నాయిగూడెం, గుండాల, పిచ్చుకలపాడు, పురుషోత్తపట్నం) తిరిగి తెలంగాణలో కలుపాలని కవిత అన్నారు. ఈ అంశంపై ప్రధాని మోదీ,

మిగతా 3లో



## మృతుని కుటుంబానికి సీపీఐ(ఎం)నాయకులు పరామర్శ

**టీ మీడియా,జులై10,సింగరేణి(కారేపల్లి) :**
కారేపల్లి మండల సీపీఐ(ఎం)కమిటీ సభ్యురాలు సుర్ణబాక ధనమ్మా-సర్వయ్య కుమారుడు మోహన్‌బాబు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. మోహన్‌బాబు సంస్మరణ కార్యక్రమంలో గురువారం పాటిమీదిగుంపులో జరిగింది. ఈకార్యక్రమానికి సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బొంతు రాంబాబు, జిల్లా కమిటీ సభ్యులు దుగ్గి కృష్ణ, మెరుగు సత్యనారాయణ, మెరుగు రమణ, కొండబోయిన నాగేశ్వరరావు, సింగరేణి మండల కార్యదర్శి కే నరేంద్ర, డివిజన్ కమిటీ సభ్యులు వజ్జ రామారావు, కొండబోయిన ఉమావతి హాజరైనారు. మృతుని చిత్రపటానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. మృతిని కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈకార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు యనమనగండ్ల రవి, వల్లెబోయిన కొండలరావు, అజ్మీర శోభన్ బాబు, ధరావత్ వినోద్ కుమార్, మన్నెం బ్రహ్మయ్య, కరపటి సీతారాములు, ఎర్రిపోతు భద్రయ్య, రేమల్లా వీరస్వామి, రేమల్ల బాబు, బచ్చల బుజ్జమ్మ, శేరు లలితమ్మ, పాయం అనసూయ, కరపటి లక్ష్మయ్య, ధరావత్ రవికుమార్, మాజీ సర్పంచ్‌లు కరపటి రాంబాయి, ధరావత్ సైదులు తదితరులు పాల్గొన్నారు.



## వర్తక సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

**టి మీడియా, జూలై 10, పినపాక ప్రతినిధి:**
పినపాక మండల పరిధిలోని ఏడూళ్ళ బయ్యారం గ్రామపంచాయతీలోని బయ్యారం ఎక్స్ రోడ్ వ్యాపారస్తులు గురువారం వర్తక సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సమావేశంలో పాల్గొన్న వర్తక వ్యాపారస్తులు తమ భవిష్యత్ కార్యాచరణ నిమిత్తం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. నూతన కార్యవర్గంలో అధ్యక్షుడిగా గుండు సురేష్, ఉపాధ్యక్షుడిగా గీదా సురేష్ బాబు ( సాయి ), ప్రధాన కార్యదర్శిగా ఆకుల సత్యనారాయణ, కోశాధికారిగా వెలదండి లక్ష్మణరావు, కార్యదర్శిగా సానికొమ్ము వెంకటరెడ్డి,ప్రచార కార్యదర్శిగా గంజాయి మురళి, గౌరవ అధ్యక్షులుగా మార్తా నరసింహారావు,గడ్డం సతీష్ బండి రమేష్, గౌరవ సలహాదారులుగా వలబోజు లక్ష్మణాచారి, భాస్కర్ రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా కమలాకర్ రాంబాబు ఆదినారాయణ నరేష్ వేణు రమేష్ మోహన్ రావు తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు గుండు సురేష్ మాట్లాడుతూ, నూతన వర్తక సంఘం అధ్యక్షుడిగా తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, భవిష్యత్తులో వ్యాపారస్తులకు సంబంధించి ఎటువంటి సమస్యలు వచ్చినా పరిష్కరించడానికి తను కృషి చేస్తానని తెలిపారు.

## ఏసీపీ, కానిస్టేబుళ్లపై వేటు

లేకపోవడంతో కేసు నమోదు కాలేదు. కానీ జరిగిన ఘటనపై సీపీ సునీల్ దత్ శాఖాపరమైన విచారణ జరిపించి, దోపిడీ ఘటనలో ఏసీపీ రవి వ్యవహార తీరుపై చర్యలకు సిఫారసు చేయగా, అతన్ని డీజీపీ ఆఫీసుకు అటాచ్ చేస్తూ ఉత్తర్వు వెలువడింది. దోపిడీలో ప్రత్యక్షంగా పాల్గొన్న ఆ ఇద్దరు కానిస్టేబుళ్లపై సీపీ సునీల్ దత్ సస్పెన్షన్ వేటు వేశారు.

## అవినీతి చక్రవర్తి

ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుకి లేఖలు రాస్తున్నట్లు తెలిపారు. ఆ ప్రాంత ప్రజల సమస్యలు అర్థం చేసుకుని తిరిగి భద్రాచలంలో విలీనం చేయాలని ఆమె డిమాండ్ చేశారు. . ఈ కార్యక్రమంలో జాగృతి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు మాధవి, జిల్లా అధ్యక్షురాలు పవన్, గోపు సదానందం, ఎండి.హుస్సేన్, బుద్ధి మధుసూదననావు, భూపతి శ్రీనివాస్, రవి, శ్రీనివాసరావు, ఇర్ఫాన్, టీబీజీకేఎస్ రాష్ట్ర సెక్రటరీ జనరల్ కాపు కృష్ణ, రాజేంద్రప్రసాద్, రెంటపల్లి మాధవీలత, సింధు తపస్విని, మధుబాబు, ప్రసాద్ గౌడ్, రాజుగౌడ్ పాల్గొన్నారు.

# ఫారెస్టు నిర్లక్ష్యంతోనే ప్లాంటేషన్ పోడు జఠిలం

**-పోడుదారులకు న్యాయం చేయాలి : ఐద్వా**

**టీ మీడియా,జులై10, సింగరేణి (కారేపల్లి) :**
కారేపల్లి మండలం మాణిక్యారాం ఎర్రబోడు ఊటవాగు సమీపంలోని ప్లాంటేషన్ పోడు సమస్య ఫారెస్టు అధికారుల నిర్లక్ష్యంతోనే జఠిలం అయిందని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు మెరుగు రమణ విమర్శించారు. గురువారం ప్లాంటేషన్ పోడు ప్రాంతాన్ని ఐద్వా, వ్యవసాయకార్మిక సంఘం నాయకులు సందర్శించి పోడుదారులతో మాట్లాడారు .ప్రత్యామ్నాయం పోడు చూపుతామని 2020 సంవత్సరంలో 60 మంది పోడుదారుల నుండి 50 హెక్టార్లు పోడును సేకరించిన ఫారెస్టు అధికారులు ప్రత్యామ్నాయ పోడు చూపకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని బాధితులు నాయకులకు తెలిపారు. న్యాయం అడిగితే కేసులు, నిర్బాంధాలు, బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.పోడుదారులను ఉద్దేశించి ఐద్వా నేత మెరుగు రమణ మాట్లాడుతూ పోడు ప్లాంటేషన్ చేసే సమయంలోనే ఫారెస్టు అధికారులు స్పందించి పోడు భూమి సర్ధుబాటు చేస్తే సమస్య ఇంత జఠిలం అయ్యేది కాదన్నారు. ప్లాంటేషన్ భూమికి మరో చోట పోడు చూపుతామని ఆశ చూపి ప్లాంటేషన్ చేసిన తర్వాత పోడుదారులపై బెదిరింపు చర్యలు పాల్పడటం సహేతకం కాదన్నారు. ప్లాంటేషన్ బాధితులది న్యాయమైన డిమాండ్ అని ఫారెస్టు ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి వారికి న్యాయం చేయాలని కోరారు. పోడుదారులకు న్యాయం జరిగే వరకు ఐద్వా అండగా ఉంటుందన్నారు. పోడుదారులను కలిసిన వారిలో



ఐద్వా మండల కార్యదర్శి కే.ఉమావతి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మెరుగు సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు కొండబోయిన నాగేశ్వరరావు, నాయకులు పండగ కొండయ్య, వజ్జా రామారావు, కురసం శ్రీను, కనికరపు లక్ష్మినారాయణ, జాటోత్ కిషన్, పోడుదారులు కరపటి అరుణ, ఈసం లక్ష్మి, ఎస్.మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.



## డ్రగ్స్, సైబర్ నేరాలకు దూరంగా ఉండాలి

**ఏఎస్పీ. పంకజ్ కుమార్ మీనా**

**టీ.మీడియా,జూలై10,చింతూరు:**విద్యార్థులు డ్రగ్స్, సైబర్ నేరాలకు దూరంగా ఉండాలని చింతూరు ఏఎస్పీ పంకజ్ కుమార్ మీనా పిలుపు నిచ్చారు. చింతూరు జిల్లా పరిషత్ హై స్కూల్ లో మెగా పేరెంట్స్ డే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులు ఏఎస్పీని మేళతాళాలతో ఆహ్వానించి, పుష్ప గుచ్చాలు ఇచ్చారు. ఈ సందర్భంగా సి ఐ తెల్లం దుర్గాప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు మత్తుపదార్థాలు జోలికి వెళ్లకుండా, మంచిగా చదివి ఉత్తమ శ్రేణిలో ఉత్తీర్ణులు అయి, పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జరిగిన ఆటల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ఏఎస్పీ పంకజ్ కుమార్ మీనా, సీఐ దుర్గాప్రసాద్, ఎంఈఓ వెంకటేశ్వర్లు, లక్ష్మీనారాయణ బహుమతులు ప్రధానం చేశారు . ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు పెంటమ్మ, భద్రయ్య, పేరెంట్స్ కమిటీ చైర్మన్ నాగేంద్రప్రసాద్, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.



## గురు పౌర్ణమి వేడుకలు

**టి మీడియా, జులై 10, పినపాక ప్రతినిధి**
:గురు పౌర్ణమి సందర్భంగా గురువారం అశ్వాపురం మండల కేంద్రంలోని కాలువ బజార్ లోని శిరిడి సాయినాథుని ఆలయంలో ఆలయ ధర్మకర్త నలగట్ల సత్య ప్రకాష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచామృతాభిషేకాలు , అర్చనలు,సామూహిక పారాయణం చేసి గురువు యొక్క గొప్పతనాన్ని చాటారు. అనంతరం ఆలయ ధర్మకర్త, మణుగూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నలగట్ల సత్య ప్రకాష్ ను బిజెపి మండల నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉమా సుధాకర్ రెడ్డి, బ్రహ్మం, రాగి అరుణాచారి, నంబూరి వెంకన్న, పాల్గొన్నారు.

## సిసిఐ ద్వారా నే కోనుగోలు చేయాలి

చేయటానికి నూతన పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఈ కొత్తపద్ధతి ఆచరణ సాధ్యం కాదన్నారు. గత వానాకాలం సీజన్లో 44 లక్షల ఎకరాల్లో 20 లక్షల మంది పైగా రైతులు పత్తి పంట సాగు చేశారని, ఇంత మంది రైతులకు బహిరంగ మార్కెట్లో విక్రయించిన తర్వాత వ్యత్యాసం ధర నగదు బదిలీ చేయడం సాధ్యం కాదన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మెరుగు సత్యనారాయణ, తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు దుగ్గి కృష్ణ, సిఐటియు జిల్లా నాయకులు కుందనపల్లి నరేంద్ర, రైతు సంఘం మండల కార్యదర్శి వజ్జా రామారావు,బాదావత్ శ్రీను, మన్నెం బ్రహ్మయ్య, వడ్లమూడి మధు, యనమద్ది రామకృష్ణ, పాల్గొన్నారు.



## సకాలంలో సీఎంఆర్ రైస్ డెలివరీ

**-అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి**

**-మిల్లర్లతో సమీక్ష**

**టీ మీడియా ,జులై 10 ,ఖమ్మం:**సకాలంలో సీఎంఆర్ రైస్ డెలివరీ రైస్ మిల్లర్లు పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి అన్నారు.కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్, సీఎంఆర్ రైస్ డెలివరీపై రైస్ మిల్లర్లతో గురువారం సమీక్షించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూలి 2024-25 సంవత్సరానికి సంబంధించి జిల్లాలో రబీ సీజన్ ధాన్యం కొనుగోలుకు సంబంధించి పెండింగ్ 36 అండర్ టేకింగ్స్ రైస్ మిల్లుల నుంచి మూడు రోజుల్లో రావాలని అన్నారు. అండర్ టేకింగ్స్ రాని రైస్ మిల్లులకు సీఎంఆర్ ఆపాలని అదనపు కలెక్టర్ తెలిపారు. ఖరీఫ్ సీజన్ పెండింగ్ 45 ఏసికే రైస్ డెలివరీ రైస్ మిల్లర్లు త్వరగా పూర్తి చేయాలని అన్నారు. 2024-25 పెండింగ్ ఖరీఫ్ 45 ఏసికే వారం, పది రోజులలో వస్తాయని, సరఫరా చేసేందుకు రైస్ మిల్లర్లు సన్నద్ధం కావాలని అన్నారు. రబీ సీజన్ సంబంధించి సీఎంఆర్ రైస్ డెలివరీ ప్రారంభించాలని, ప్రతి బాయిల్డ్ రైస్ మిల్లు నుంచి రోజు 2 ఏసికే, రా రైస్ మిల్లు నుంచి 1 ఏసికే చొప్పున మన జిల్లాలో ప్రతి రోజు 40 ప్లస్ ఏసికే సీఎంఆర్ రైస్ డెలివరీ చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. 2025-26 సీజన్ ఖరీఫ్, రబీ నుంచి బ్యాంకు గ్యారంటీ 10 శాతం ఇచ్చేలా చూడాలని అన్నారు.ఎఫ్.సి.ఐ. ప్రతినిధులు ప్రతి రోజు రైస్ డెలివరీ నిర్దేశిత లక్ష్యాల ప్రకారం తీసుకునేలా చర్యలు తీసుకుంటామని, అవసరమైన మేర స్పేస్ ఎఫ్.సి.ఐ. కేటాయించేలా చూస్తామని అన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ మిల్లుల వారీగా పెండింగ్ రైస్ డెలివరీ సంబంధించి సమీక్ష నిర్వహించి త్వరగా రైస్ డెలివరీ పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు.ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి చందన్ కుమార్, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శ్రీలత, ఏ.ఎం.ఓ. మిల్లర్ అసోసియేషన్ అధ్యక్షులు బొమ్మ రాజేశ్వర రావు, కార్యదర్శి, ప్రతినిధులు సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## గురు పౌర్ణమి వేడుకలు

**టీ మీడియా ,జులై 10 ,ఖమ్మం**
:ఖానాపురం హవేలి బైపాస్ రోడ్డు విజయనగర్ కాలనీ రోడ్ నెంబర్ - 2 లో ఉన్న శ్రీ షిరిడి సాయిబాబా మందిరంలో గురువారం ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు నిర్వహించారు . ఉదయం 5 గంటల నుండి బాబా వారికి కాకడ హారతి , గురుపూజ , విశేష పూజలు , సాయి సత్య వ్రతాలు ఘనంగా జరిగాయి . మధ్యాహ్నం హారతి తర్వాత అన్న ప్రసాద వితరణ నిర్వహించారు . సాయంత్రం సాయి భజన కార్యక్రమం కూడా జరిపారు . ఈ కార్యక్రమంలో ఆలయం ఛైర్మన్ ఫణిభట్ల రాజలింగయ్య , వైస్ చైర్మన్ బుద్దా రామకృష్ణ , జనరల్ సెక్రటరి పెంట్యాల వెంకటనర్సయ్య , జాయింట్ సెక్రటరి చంద్ర వీరభద్రరావు , ట్రెజరర్ కవులూరి అప్పారావు , సభ్యులు మండెపూడి కృష్ణయ్య , దొడ్డా నరసింహారావు , భూక్యా భిక్షపతి , స్థానిక కార్పొరేటర్ పైడిపల్లి రోహిణి సత్యనారాయణ ,పాల్గొన్నారు.

